26042024-DIS-04_Layout 1 4/26/2024 3:40 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

మలిసంజెలో ఆరోగ్య బీమా

మన దేశంలో అధికారిక జనాభా గణాంకాలు 2011 నాటివే అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం వాడుతున్న గణాంకాలు అంతర్జాతీయ నివేదికల ఆధారంగా వేసుకున్న సాపేక్ష అంచనాలే. వీటి ప్రకారం మన దేశ జనాభా 2023 మధ్యలోనే చైనాను మించిపోయింది. ఆ రకంగా ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ చలామణి అవుతున్నది. ఐక్యరాజ్య సమితి అంచనాల మేరకు రూపొందించిన భారత వృద్ధాప్య నివేదిక 2023 ప్రకారం 2022 నాటికే 60 ఏండ్లు పైబడిన వారు మన దేశ జనాభాలో 10 శాతం వరకు ఉన్నారు. 2050 నాటికి వీరు జనాభాలో 30 శాతం మేరకు ఉండొచ్చని అంచనా. జీవన ప్రమాణాలు పెరగడం వయో వృద్ధుల శాతం పెరగడానికి ప్రధాన కారణం. ఒక అంచనా ప్రకారం 2018 నాటికి సగటు జీవన పరిమాణం 69.1 సంవత్సరాలు. నిన్నామొన్నటి వరకు యువ జనాభా పెరిగిందని మురిసిపోయాం. ఇప్పుడు వృద్ధుల జనాభా పెరుగుతుండటం సరికొత్త సవాలును మన ముందుకు తెస్తున్నది.

వృద్ధుల జనాభా పెరుగుదలను వెంబడించి అనేక ఇతర సమస్యలు తలెత్తడం సహజం. మానసిక ఒత్తిడులు, కాలుష్యం, జీవన శైలి కారణంగా వ్యాధులు శరవేగంగా విస్తరిస్తుండటం మనం చూస్తున్నాం. శరీరం బలహీనమైపోయే మలిసెంజెలో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా బాధిస్తాయి. ముఖ్యంగా మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్లు ముసలితనంలో చిక్కులను తెచ్చిపెడుతాయి. ఒక అంచనా ప్రకారం మన దేశంలోని వృద్ధుల్లో 75 శాతం మందికి ఏదో ఒక దీర్ఘకాలిక వ్యాధి ఉన్నది. సూక్ష్మ కుటుంబవ్యవస్థ విస్తరిస్తున్న కారణంగా వృద్ధులకు ఆదరణ, అండదండలు కరువవుతున్నవి. అందువల్ల ఆరోగ్య సేవలు, చౌకైన మందులు, ఇతర సౌకర్యాలు వృద్ధులకు తప్పనిసరిగా అవసరమవుతాయి. ఆ ఇతర సౌకర్యాల్లో ఆరోగ్య బీమా అనేది అత్యవసరం.

ప్రస్తుతం మన దేశంలో ఆరోగ్య బీమా పొందేందుకు అర్హమైన వయస్సు 65 కంటే తక్కువ. అంటే 65 దాటినవారు కొత్తగా ఆరోగ్య బీమా కోసం దరఖాస్తు చేసుకుంటే కుదరదు. పెరుగుతున్న ఆరోగ్య సేవల వ్యయం దృష్ట్యా ఇది వయోవృద్ధులకు పెద్ద సమస్యగా ఉన్నది. బీమారంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ ఇటీవల ప్రవేశ వయస్సు పరిధిని పెంచాలని బీమా సంస్థలను ఆదేశించింది. మారుతున్న సామాజిక వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ మార్పును తీసుకువచ్చారన్నది తెలుస్తూనే ఉన్నది. ఇది ఆహ్వానించి, అభినందించాల్సిన విషయమే. కుటుంబంలో చిన్నా పెద్దా కలిపి ఫ్లోటర్ పద్ధతిలో ఉమ్మడిగా బీమా తీసుకుంటే కొంత వ్యయం కూడా కలిసివచ్చే మాట నిజమే. అయినప్పటికీ కేవలం బీమా సౌకర్యం విస్తరణ ఒక్కటే సరిపోదు. సర్కారీ వైద్య వ్యవస్థను అత్యాధునికంగా విస్తరించి అందుబాటులోకి తేవాలి. ప్రైవేటురంగంలో ఆరోగ్య వ్యయాన్ని కూడా తగ్గించి అందరికీ అగ్వగా చికిత్సలు అందించాల్సిన అవసరం ఉన్నది. ఈ సమతూకం సాధించలేకపోతే ఆరోగ్య బీమా విస్తరణ అనేది అసంపూర్తి కార్యాచరణగా, ఆస్పత్రులు, బీమా సంస్థల దోపిడీకి ఉపకరణంగా మారిపోయే ప్రమాదం ఉంది.

వ్యవసాయమే ఓ వైకుంఠపాళి

'వ్యయము చేసి దేవుని సహాయం కోరేదే వ్యవసాయం' అని మా నాన్న చెప్పిన మాట. కానీ, రాష్ట్రంలో ప్రస్తుత వ్యవసాయాన్ని పరిశీలిస్తే వైకుంఠపాళి ఆట గుర్తుకొస్తున్నది. 130 రోజుల యాసంగి వరి పంట కాలం.. 142 రోజుల కాంగ్రెస్ పాలన.. 143 గడులున్న పరమపద సోపాన పఠము అన్నీ ఒకే లాగ కనిపిస్తున్నాయి. వైకుంఠపాళి ఆటలో 10 నిచ్చెనలు, 13 పాములుంటాయి. కేసీఆర్ పదేండ్ల పాలనలో వ్యవసాయం పండుగైంది. రైతు బంధు వంటి సంక్షేమ పథకాలతో రైతులకు అన్నీ నిచ్చెనలే వచ్చాయి. కాంగ్రెస్ పాలనలో మాత్రం అడుగుకొక పాము గండం ఎదురవుతున్నది.

మారెడ్డి సంజీవ్‌కుమార్
91827 77465

ఆరు గ్యారెంటీల్లో భాగంగా వరంగల్‌లో కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ సమక్షంలో రైతు డిక్లరేషన్ ప్రకటించారు. ఇందులో రైతులకు అరచేతిలో వైకుంఠం చూపించి హస్తం పార్టీ అధికార పీఠమెక్కింది. వైకుంఠపాళిలో ప్రతి పది గడులకు ఒక పాము ఎదురైనట్టు.. కాంగ్రెస్ పాలనలో రైతులకు ప్రతి పదిహేను రోజులకు ఒక కష్టం ఎదురైతున్నది. 'మే మొస్తే రైతుబంధు ఏడాదికి రూ.15 వేలు ఇస్తాం' అని చెప్పిన పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాసంగి పంటలు కోతలు చేస్తున్నా ఇంకా పూర్తి పెట్టుబడి సాయం ఇవ్వనే లేదు. ఇక కౌలు రైతులకు ఏడాదికి రూ.12 వేల హామీపై ఉలుకు, పలుకు లేదు. కోటి ఆశలతో యాసంగి సాగు ప్రారంభించిన రైతులు ప్రతి దశలోనూ పుట్టెడు కష్టాలు పడుతున్నారు. మొగులుకు ముఖం చూడకుండా వ్యవసాయం చేసుకుందామన్న కేసీఆర్‌ను కాదని మార్పు కోసం కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. కానీ, కాంగ్రెస్ వచ్చీ రావడంతోనే రైతులకు కరెంటు కష్టాలు మొదలయ్యాయి. 24 గంటల ఉచిత కరెంటు నుంచి అర్ధరాత్రి దొంగ కరెంటుకు పరిస్థితి మారింది. మిణుగురు పురుగులా వచ్చీపోయే కరెంటుతో మోటర్లు కాలిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయి. ప్రాజెక్టుల్లో నీటి ప్రణాళిక లేక పంటలకు సాగు నీళ్లు కరువయ్యాయి. రైతులు పంటలను కాపాడుకోవడానికి ట్యాంకర్లను అద్దెకు తీసుకున్నారు. కిలోమీటర్ల కొద్దీ పైపులైన్లను పరుచుకున్నారు. పొట్టకొచ్చిన పంటను కాపాడుకోవడానికి అప్పులు తెచ్చి మరీ బోర్లు వేశారు. ఒక బోరు ఫెయిలైతే.. రెండో బోరు.. అది ఫెయిలైతే.. మూడో బోరు.. ఇలా ఎకరం పొలంలోనే 11 బోర్లు వేసిన రైతులూ ఉన్నారు. బొట్టు బొట్టు ఒడిసిపట్టి పంటను కోసు కొచ్చిన రైతుకు కనీస 'మద్దతు' దక్కలేదు. పాలకులకు పార్లమెంట్ ఎన్నికల కసరత్తుపై ఉన్న ధ్యాస ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై లేకపోయింది. కోడ్ సాకుతో కాగితాలపైనే అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 7,104 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని చెప్తున్న పౌరసరఫరాల శాఖ, ఇప్పటివరకు 2,480 కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు ప్రారంభించింది. ఇంకా 4,720 కేంద్రాలు అంటే దాదాపు 70 శాతానికిపైగా కేంద్రాల్లో ఒక్క గింజ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదు. మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ వస్తుందని నమ్మి కొనుగోలు కేంద్రాలకు వడ్లను తెచ్చిన రైతులకు నిరాశే ఎదురైంది. కొనుగోలు కేంద్రాల్లోని కొర్రీలను చూసి వెర్రెక్కిపోయింది. రోజులు గడుస్తున్నా.. పడిగాపులే తప్ప కాంటా కావడం లేదు. తన వంతు కోసం చకోర పక్షిలా ఎదురుచూస్తున్నారు. పగలనకా, రాత్రనకా కొనుగోలు కేంద్రాల్లోనే వరి కుప్పలకు కాపలా ఉన్నారు. నడినెత్తిన సూర్యుడు భగ్గుమంటున్నా వడ్లను పొద్దంతా రెక్కలు ముక్కలు చేసుకొని ఎండబోశారు. ఆకలి బాధను.. కూలీల భారాన్నీ భరించారు. ఎన్నిసార్లు ఎండపోసినా ఏ గ్రేడ్‌కు మాత్రం నోచుకోలేదు. మాయిశ్చర్ ఉందని మాయమాటలు... ధాన్యంలో పొల్లు ఉందని సొల్లు కబుర్లూ విన్నారు. ఇన్నిచేసినా ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో కాంటా కావడమే కష్టం. కాంటా అయినప్పటికీ గన్నీ సంచులు దొరకవు.

గన్నీ సంచులు దొరికినా లారీలు రావు. లారీల్లో ధాన్యం లోడ్ ఎక్కినా అవి మిల్లు వరకు చేరుతాయనేది అనుమానమే. మిల్లర్లు కొర్రీలు లేకుండా ధాన్యాన్ని దించుకునేవరకూ రైతులు బిక్కు బిక్కుమనాల్సిందే. మిల్లులో లోడ్ దిగి, బ్యాంకు ఖాతాలో డబ్బులు జమయ్యేవరకు ఎదురు చూడాల్సిందే. రైతులను ఇబ్బంది పెట్టొద్దు... వాలికి అన్యాయం చేయొద్దు అని కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ చెప్పినా ధాన్యం లోడ్‌ను మిల్లర్లు తిప్పిపంపారు.

గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు వ్యాపారులకు ధాన్యం అమ్ముకుంటున్నారు. కల్లాల వద్దే కాంటాలు పెడుతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు క్వింటాలు ధాన్యానికి రూ.200 నుంచి రూ.400 వరకు తక్కువ ధర చెల్లిస్తున్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చెప్పినా మద్దతు ధరపై చేతులెత్తేశారు. ఇది చాలదన్నట్టుగా 40 కిలోల సంచికి 42 కిలోలు తూకం వేస్తున్నారు. దీనివల్ల రైతులు క్వింటాలుకు 5 కిలోల ధాన్యం దగా పడుతున్నారు. ఇవికాకుండా కూలీల ఖర్చుల కింద బస్తాకు రూ.10, అమ్ముకున్న వెంటనే డబ్బులు కావాలంటే నూటికి రూ. 2 చొప్పున కమీషన్ తీసుకుంటున్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోపాటు వ్యాపారుల వంచనకు గురైన రైతుపై ప్రకృతి కూడా పగబట్టింది. వడగండ్ల వానతో పొట్టకొచ్చిన పంటంతా నేల పాలైంది. అకాల వర్షాలు కొనుగోలు కేంద్రాలను ముంచెత్తాయి. వాన నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. కండ్లముందే కొట్టుకుపోతున్న ధాన్యాన్ని చూసి రైతులు కన్నీరు కార్చారు. ధాన్యం తడవకుండా కాపాడుకోవడానికి ముప్పుతిప్పలు పడ్డారు. బస్తాలకు సరిపడా టార్పాలిన్లు లేక ఇబ్బందులు పడ్డారు. ఇలా చెప్పుకుంటూ పోతే రైతుల కష్టాలకు, కన్నీళ్లకు అంతే ఉండదు. యాసంగి సాగులో రైతులకు అడుగడుగునా పాము గండాలే. కనీసం రోజుకొకరు, ఇద్దరు అన్నట్టుగా వంద రోజుల్లోనే రెండొందల మంది రైతులు బలిపీఠమెక్కారు. అన్నదాతలు ఉరికొయ్యలకు వేలాడుతున్నా.. రైతు కుటుంబాలు అరిగోస పడుతున్నా కాంగ్రెస్ పాలకులు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడలేదు. ఇప్పటివరకు పంట నష్టం లెక్కలు తీయలేదు. తడిసిన ధాన్యం కొంటామని భరోసా ఇవ్వలేదు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పక్క రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్లారు గానీ, రాష్ట్రంలోని రైతులను మాత్రం పరామర్శించలేదు. పైపెచ్చు భద్రాద్రి రాముడి మీద ఒట్టు.. ఏడుపాయల దుర్గమ్మ మీద ఒట్టు.. యాదగిరి నరసింహుడి మీద ఒట్టు.. బాసర అమ్మవారి మీద ఒట్టు అంటూ పంద్రాగస్టు డెడ్‌లైన్లు పెడుతున్నారు. మత గ్రంథాల కన్నా పవిత్రమైన మ్యానిఫెస్టోపైనే మాట తప్పి ఎన్ని ఒట్లు పెడితే ఏం లాభం? కన్నతల్లికి అన్నం పెట్టకుండా పినతల్లికి బంగారు గాజులు చేయిస్తా అన్నట్టు.. రైతుబంధు ఇవ్వని నేతలు రుణమాఫీ చేస్తామంటే నమ్మాలా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. బోనస్‌పై బోగస్ మాటలను కట్టిపెట్టాలని మండిపడుతున్నారు. తెల్వక కయ్యల పడ్డం.. మళ్లీ మోసపోతే గోస పడుతమని తెలివి కొచ్చి మాట్లాడుతున్నరు.

వైకుంఠపాళిలో పాములను తప్పించుకొని, నిచ్చెనలను ఎక్కినవారే విజేతలు. ఆటలో గెలవాలంటే 'అష్ట' పడాల్సిందే. ఇప్పుడు రాష్ట్రంలో రైతులు కూడా పాముల నుంచి తప్పించుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కనీసం 8 సీట్లు ఇవ్వాలి. కేసీఆర్‌కు 10 సీట్లు వస్తే వైకుంఠపాళిలో 10 నిచ్చెనల్లాగే రైతులకు ఉపయోగం ఉంటుంది. గులాబీ నిచ్చెనలను తయారుచేసుకోవాల్సిన బాధ్యత కూడా రైతులదే.

బీసీలను ఇంకెన్నాళ్లు మోసం చేస్తారు?

2023 కాంగ్రెస్ ఎన్నికల సభల్లో రాహుల్‌గాంధీ బీసీలకు స్థానిక రాజ్యాలు అప్పగిస్తామని గట్టిగా మాట్లాడారు. అదిప్పుడు చేస్తారా? అని తెలంగాణ బీసీ సమాజం ఎదురు చూస్తున్నది. రాష్ట్రాన్ని పాలిస్తున్న ఇక్కడి పెద్దలు మొత్తం బడ్జెట్‌లో బీసీలకు సగం బడ్జెట్ కేటాయించవలసి ఉన్నది. పంచాయతీరాజ్ వ్యవస్థలో 42 శాతం ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే దాని ద్వారా 24 వేల మంది ఓబీసీలు కొత్త నాయకులుగా ఎదిగివస్తారని రాహుల్ గాంభీర్యంగా 2023 వరంగల్ ఎన్నికల సభలో చెప్పారు. స్థానిక సంస్థల్లో 24 వేల మంది బీసీ నాయకులు రావటం హర్షించే విషయమే, కానీ దీన్ని ఏ రకంగా చేయగలరన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

పంచాయతీరాజ్ చట్టం ఓబీసీల రిజర్వేషన్లకు సంబంధించి 1993 నుంచి తెలుగు రాష్ట్రాల్లో ఏ విధంగా అమలుచేశారో ఒక్కసారి వెనక్కు తిరిగి చూడవలసి ఉన్నది. ఎన్నికల వాగ్దానాలు చేయటం ఓబీసీల ఓట్లను కొల్లగొట్టటం రివాజుగా జరుగుతున్న చర్య. కానీ ఆచరణలో మాత్రం బీసీలు ప్రతిసారీ దగాకే గురవుతున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శక సూత్రాలకనుగుణంగా చూస్తే రాహుల్‌గాంధీ చెప్పింది ఆచరణలో సాధ్యం కాదు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లను ప్రకటించినా అందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకత్వం వల్ల అది సాధ్యం కాదని చేతులెత్తేయటం సహజంగా జరిగే చర్యే.

జూలూరు గౌరీశంకర్

బీసీలకు ఏ విధంగా చూసుకున్నా కూడా స్థానిక సంస్థల రిజర్వేషన్లలో నిరాశే మిగులుతుంది. ఈ అంశంపై కేంద్రాన్ని 77 ఏండ్లుగా ఏలుతూ వస్తున్న కాంగ్రెస్, బీజేపీలు రెండు ఓబీసీ రిజర్వేషన్ల పెంపుపై చెప్పలేని రాయలేని నిర్లక్ష్యానికి గురిచేస్తూ వస్తున్నాయి. ఓట్ల కోసం వచ్చినప్పుడు తప్ప తిరిగి బీసీల సమస్యను రాజకీయపార్టీలు పట్టించుకోవు. ఇందుకు రాష్ట్రంలోని బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చి తమ డిమాండ్లను సాధించుకోవాలి. 60 శాతం మంది బీసీల దీర్ఘకాలిక సమస్యగా ఇది బీసీలను క్షోభకు గురిచేస్తుంది. రాష్ట్రం నుంచి ముక్తకంఠంగా ఒకే స్వరంతో బీసీలు ఐక్యమత్యంతో కదిలే సమయం దగ్గరికి వచ్చింది. మనం వేసే ఈ అడుగులే పొరుగు రాష్ట్రాల్లో ప్రభావం చూపుతాయి. ఇది ఓబీసీల జాతీయ ఉద్యమంగా మారాలి. ఇందుకు బీసీ విద్యావంతులు ఎక్కడికక్కడ ఉద్యమ గొంతుకలుగా మారాలి. బీసీ, ఎంబీసీ, ఉపకులాల సంచారజాతుల అనేకానేక సమస్యలకు తక్షణ ఉద్యమాలు రావాలి. అవే రేపటి బీసీల హక్కుల దీర్ఘకాలిక ఉద్యమంగా దేశవ్యాపిత మహోద్యమంగా మారవలసి ఉన్నది.

రాజ్యాంగంలోని 243-డీ ప్రకారం స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపు జరిగింది. అదేవిధంగా మొత్తం సీట్లలో 1/3 వంతు స్త్రీలకు కేటాయింపు చేశారు. ఇక బీసీలకు సంబంధించిన రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వాలకు విడిచిపెట్టారు. దీని ప్రకారం ఏ రాష్ట్రంలో కూడా బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు వచ్చే అవకాశమే లేదు. ఇందుకు కారణం సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం 50 శాతం రిజర్వేషన్ దాటకూడదన్న నిబంధన.

పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయకుండా బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పొందలేరు. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లపై నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. ఇప్పుడు మాత్రం తాము అధికారంలోకి వస్తే ఓబీసీ కులగణన, పంచాయతీరాజ్ వ్యవస్థలో రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్‌గాంధీ చెప్తున్నారు. బీజేపీ పార్లమెంటు సాక్షిగానే బీసీ కులగణన చేయబోమని చెప్పింది. ఇలాంటి సందర్భంలో బీసీలు స్థానిక రాజ్యాల్లో తమకు రావాల్సిన సమ వాటా కోసం సమరాలు చేయకతప్పదు. ఇందుకోసం రాజకీయాలకతీతంగా బీసీలందరూ ఒక్కతాటిపైకి రావాల్సిన అత్యవసర సమయం వచ్చింది. బీసీలను ఇంకెంతకాలం మోసం చేస్తారని అన్ని రాజకీయపార్టీలను నిగ్గదీసే సమయం దగ్గర్లోనే ఉన్నది.

రేవంత్-హరీశ్ సవాళ్ల యుద్ధం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చూస్తే ఆశ్చర్యం కలుగుతున్నది. సాధారణంగా ఎవరైనా ఎందుకైనా ఒకసారి అసత్యం చెప్పినప్పుడు, అది అసత్యమని నలుగురికీ తెలిసిపోతే, అంతటితో జంకు కలిగే సదరు అసత్యాన్ని తిరిగి చెప్పరు. కానీ, రేవంత్‌రెడ్డి అట్లా కాదు. తను ఒక అరుదైన వ్యక్తి. అదే అసత్యాన్ని బేఫికర్‌గా మళ్లీ మళ్లీ ఎన్ని సార్లయినా చెప్పగలరు. అది శక్తిమంతమైన నాయకత్వానికి నిదర్శనమన్నది ఆయన నమ్మకమేమో తెలియదు. కాని ప్రజలట్లా భావిస్తున్నట్టు కన్పించదు. అది తన బలహీనతగానే తీసుకుంటున్నారు. ఉదాహరణకు ఆరు గ్యారెంటీల అమలు, 30 వేల ఉద్యోగాల భర్తీ విషయాలు. వాటితో పాటు ప్రస్తుతం సవాళ్లకు కేంద్రంగా మారిన రైతు రుణమాఫీ మరొకటి.

వందరోజుల గడువుతో ప్రజలకు బాండ్ పేపర్లపై ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో మూడింటిని అమలు చేశామని కొద్దికాలం కిందటి వరకు చెప్పిన ముఖ్యమంత్రి, ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఆ సంఖ్యను నాలుగుకు పెంచి, ఇప్పుడు అయిదంటున్నారు. ఇందులోని సత్యాసత్యాలలోకి వెళ్లే ముందు చెప్పకోవలసిన మరొక విషయం 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నది. ఈ రెండు మాటలు కూడా నిజం కాదన్నది పరిశీలకుల లెక్కలలో ఎప్పుడో తేలింది. అదేమిటో కొద్ది సేపట్లో చూద్దాము. అదట్లుంచి గత కొద్దిరోజులుగా మరొక విషయం ముందుకొచ్చింది. అది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ప్రశ్న. కనుక మొదట అందులోకి వెళ్లాలి.

ముఖ్యమంత్రి సవాలుకు హరీశ్ ప్రతి సవాలు ఇప్పటికే ముందుకొచ్చింది. ఆగస్టు 15 నాటికి రుణమాఫీతో పాటు, వందరోజుల గడువు గల ఆరు గ్యారెంటీలలోని 13 హామీలన్నింటిని అమలుపరిచే పక్షంలో తాను అసెంబ్లీకి రాజీనామా చేయటమే గాక, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోగా ఉప ఎన్నికలకు సైతం తిరిగి పోటీ చేయబోనని ప్రకటించారు. అమలు జరపటంలో విఫలమైతే రేవంత్‌రెడ్డి సీఎం పదవిని వదులుకోవాలన్నారు. ఇది ఏ విధంగా చూసినా సమంజసమైన ప్రతిపాదన. ప్రభుత్వానికి స్వయంగా తామే ఇచ్చిన హామీల అమలుకు 100 రోజులకు బదులు సుమారు 250 రోజుల సమయం లభిస్తుంది. అది 150 శాతం ఎక్కువ. ఇది చాలా మంచి అవకాశం గనుక ఇందుకు ముఖ్యమంత్రి నిస్సంకోచంగా అంగీకరించవచ్చు. ఆ పని చేసి అమలు కూడా చేసినట్లయితే తన ప్రతిష్ట గణనీయంగా పెరుగుతుంది. హామీలను 100 రోజులలో అమలుపరచని అప్రతిష్ట కొట్టుకుపోతుంది. తర్వాత నాలుగున్నరేండ్ల పాటు తమకు అసెంబ్లీలో హరీశ్‌రావు 'తల నొప్పి' ఉండదు. ఇందులో మరొక విచిత్రం ఏమంటే రుణమాఫీ అమలు చేస్తే హరీశ్ రాజీనామా చేయాలంటున్నారు గానీ, అమలు చేయలేకపోతే తను రాజీనామా చేస్తానని మాత్రం ప్రకటించటం లేదు.

రేవంత్‌రెడ్డి బేఫికర్ అసత్యాలకు మరొక ఉదాహరణ, తామిప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామనటం. ఇది ఎంతమాత్రం నిజం కాదని, అవన్నీ కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లేనని సాక్షాత్తూ నిరుద్యోగులే పలుమార్లు స్పష్టం చేసిన తర్వాత కూడా ఆయన ఆ ఉద్యోగాలు తమవని మళ్లీ మళ్లీ చెప్పటాన్ని చూసి ఏమనాలో తోచటం లేదు. బహుశా ఎవరికీ తోచదు. ఆరు గ్యారెంటీల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. ఆ గ్యారెంటీ కార్డును ప్రస్తుత వివాద సందర్భంగా పరిశీలించగా, అందులోని ఆరింటిలో ఏ అయిదింటిని అమలుపరిచామని రేవంత్‌రెడ్డి చెప్తున్నారో తెలియకుండా ఉంది.

ఆరింటిలోని 13 హామీలలో అమలుకు తెచ్చినవి ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీ విలువ పెంపు అనే నాలుగు మాత్రమే. వీటిలో రెండవది, మూడవది ఆరంభించారు గాని పూర్తికాలేదు. చివరిది కేసీఆర్ అధికారంలో ఉండగానే అమలుకు వచ్చింది. ఇల్లు లేని వారికి రూ. 5 లక్షలన్నది 5వ హామీ అనుకుంటే అది ఎక్కడో నామకార్థంగా మాత్రమే మొదలైంది. అయినప్పటికీ మొత్తం అయిదు అనుకుంటే, 13 హామీలలో తక్కిన ఎనిమిదింటికి ఇంతవరకు ఆరంభమైనా జరగలేదు. అయినా రేవంత్‌రెడ్డి చతురమైన రీతిలో లెక్కలు గడుతూ, 6 గ్యారంటీలలో గల 13 ఉప హామీలలోని 5కు మాత్రం ఆరంభం చేసి, వాటిని మొత్తం 6 గ్యారెంటీలలో 5గా లెక్క చెప్తున్నారు.

ప్రజలతో ఈ చాతుర్యాలు ఒక ముఖ్యమంత్రికి తగినవేనా? ఆయన ప్రజలతో నిజాయతీగా ఉండదలిస్తే, ఆ 5 ఏమిటో, 6 గ్యారెంటీలలోని 13 హామీలేమిటో, వాటిలో దేని పరిస్థితి ఏ విధంగా ఉందో ఒక్కొక్కటిగా లెక్క చెప్పాలి. అట్లా చేయటం లేదు గనుకనే తనపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు రావటం అట్లుంచి, అంతకన్న ముఖ్యంగా ప్రజలకు విశ్వాసం లేకుండా పోతున్నది. ముఖ్యమంత్రి ప్రతిపక్షాలను ఇతర విమర్శకులను తోసిపుచ్చవచ్చు. కాని ప్రజలను తోసిపుచ్చలేరు గదా?

ఇప్పుడు ఆగస్టు 15 కొత్తగా గడువు మాట చూద్దాం. ముఖ్యమంత్రి అప్పటికి రుణమాఫీ చేసి తీరగలమని దేవుళ్లపై ప్రమాణాలు చేస్తున్నారు. తెలంగాణలో ఈ ప్రమాణాల సంస్కృతి ఒకటి రాజకీయాల్లోకి గమ్మత్తుగా ప్రవేశించింది. దీనిని బీజేపీ, కాంగ్రెస్‌లు తమ నిజాయితీ లేనితనానికి నిదర్శనంగా తీసుకువస్తున్నాయి. అదట్లుంచి ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీకి మొత్తం రూ.39 వేల కోట్లు అవసరమన్నది ఒక అంచనా. అది చేయటం సాధ్యం కాదన్నది ఒక అభిప్రాయం. గమనించవలసింది ఒకటున్నది. వంద రోజుల గడువు గల 6 గ్యారెంటీలలోని 13 హామీలలో ఉన్న వాటి అమలుగురించి ఆయన ఇప్పటికీ ఏమనటం లేదు. వాటి మాటేమిటని ప్రజలు, ప్రతిపక్షాలు, ఇతరులు సూటిగా ప్రశ్నించినా స్పందించటం లేదు. వాటిలో మహిళలకు ప్రతి నెల రూ.2500, రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12,000, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, పింఛన్లను రూ.4,000కు పెంచటం అనేవి ఉన్నాయి. ఇవిగాక నిరుద్యోగ భృతి నెలకు రూ.4,000, ఆటో కార్మికులకు రూ.12,000 చొప్పున సహాయం, ఆడపిల్లల పెళ్లికి తులం బంగారం అనేవీ ఉన్నాయి. ఇవన్నీ భారీ మొత్తంలో ఖర్చుతో కూడుకున్నవి. వీటికి కాగల ఖర్చెంతో కూడా ప్రభుత్వం వద్ద అంచనాలు ఉన్నట్టు కనిపించదు. అంచనా వేసేందుకే వారు భయపడుతున్నట్టున్నారు. ఇటువంటి స్థితిలో, ఆగస్టు 15ను గడువు రోజుగా తీసుకుంటే, రేవంత్‌రెడ్డికి, హరీశ్‌రావుకు మధ్య సవాళ్లు-ప్రతి సవాళ్లు ఏ విధంగా ముగియవచ్చునన్నది ఆసక్తికరంగా మారుతున్నది.

టంకశాల అశోక్

కేసీఆర్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ అయినా చేయలేదని అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరాధారంగా ఆరోపించిన రేవంత్‌రెడ్డి, తాము గెలిచినట్టయితే డిసెంబర్ 9వ తేదీనాడే రూ.2 లక్షల రుణమాఫీ ఒకే విడతలో చేయగలమని, ఆ ఫైలుపైనే తొలి సంతకం చేయగలమని, కనుక రైతులు వెంటనే బ్యాంకులకు వెళ్లి రూ.2 లక్షల కొత్త అప్పు తెచ్చుకోవాలని ప్రకటించటం తెలిసిందే. కానీ 9 గడిచిపోయి, తర్వాత 100 రోజుల గడువు, ఆ తర్వాత మరొక 20 రోజుల కాలం గడిచిపోయినా ఇదేమీ జరగకపోగా, రేవంత్‌రెడ్డి ఈ ప్రశ్నపై ఈరోజు వరకు కూడా అసలే మాట్లాడకపోవటం గమనార్హం. నిజానికి ఇవన్నీ పలుమార్లు చర్చకు వచ్చిన, పదేపదే రాసిన విషయాలే అయినందున ఇప్పుడు తిరిగిరాయటం విసుగెత్తించే విషయమే. కానీ ఈ ప్రశ్న గత రెండు రోజులుగా రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావుల మధ్య తీవ్రమైన సవాళ్లు, ఎదురు సవాళ్లుగా మారినందున రాయకతప్పటం లేదు. పైగా ఈ అంశం ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఎంతైనా ఉన్నది.

మొదట జరిగింది ఈ కింది విధంగా ఉన్నది. రుణమాఫీ ఏమైందని రైతులు, ప్రతిపక్షాలు, ఇతరులు ఎంత ప్రశ్నించినా ముఖ్యమంత్రి మౌనాన్నే పాటించారు. తన మంత్రులు, శాసనసభసభ్యులు మాత్రం తలొక తీరున మాట్లాడటం మొదలుపెట్టారు. మాఫీకి తేదీ ఏమీ చెప్పలేదని, 9వ తేదీ అనలేదని, వంద రోజులని కూడా అనలేదని, అసలు మాఫీ మాటే అనలేదని చిత్ర విచిత్రమైన వాదనలు సాగించార